# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY-2015

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

| | | |
|---|---|---|
| **ఆదివారం సాయంత్రం** | : | **6.00** గంటలకు శుభవార్త |
| **బుధవారం సాయంత్రం** | : | **6:30** గంటలకు రక్షణ |
| **గురువారం ఉదయం** | : | **11:00** గంటలకు రక్షణ |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |
| శ్రేష్టమైన జీవితం | : | Better Life |

మంగళ, గురువారాల్లో - ఉదయం **7:30** గంటలకు రక్షణ

బుధ, శుక్రవారాల్లో - ఉదయం **9:30** గంటలకు రక్షణ

ప్రసంగీకులు : పలివెల మణికుమార్

పై కార్యక్రమములను టి.విలో చూడండి. మీ బంధు మిత్రులను కూడ ప్రోత్సహించండి. ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX.80, KAKINADA

Pin : 533004

Ph : 0884 -2363722

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH


P.o. Box -80, Kakinada,A.P. 533 001

Ph : 0884 - 2363722

Mobile : 9848998547

Editor :

**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 35 | ఫిబ్రవరి - 2015 | సంచిక - 7


## పరలోకము - రక్షింపబడిన వారి నిత్య గృహము

## ( Heaven, the eternal Home of the Redeemed)

పరలోకము ఉన్నది, క్రీస్తుద్వారా ప్రతివాడు దానిలో ప్రవేశించవచ్చు అను గొప్ప నిరీక్షణను క్రైస్తవ్యము వలన మానవులు కలిగి యున్నారు. పరలోక నిరీక్షణను బట్టి క్రైస్తవులు ఈలోకములో ఒండొరుల భారములను భరింతురు, శోధనల నెదుర్కొందురు, ఈ లోకాశలను భక్తిహీనతను త్యజింతురు, నిరుత్సాహ పడువారికి ప్రోత్సాహమిత్తురు. వీటన్నిటిని బట్టి క్రైస్తవులు ఈలోకములో ఫలము నాశించరు గాని మోక్షము అను బహుమానము కొరకై నిరీక్షింతురు. నిజముగా క్రైస్తవ జీవితము జీవించదగిన జీవితమై యున్నది.

పరలోకపు సౌందర్యమును, దాని నిజస్థితిని మనము అర్థము చేసుకొను నిమిత్తము వివిధ సంగతులతో అది మనకు బైబిలునందు పోల్చబడి యున్నది. ఆదాము హవ్వలు నివసించిన ఏదెను వనముతో అది పోల్చబడి యున్నది. పాపము చేయుట వలన మానవులు ఆ వనములో నుండి తొలగించబడిరి.

అయితే పాపమును జయించుట వలన వారు దానిలో పున:ప్రవేశించగలరు. "జయించు వానికి దేవుని పరదైసులో ఉన్న జీవ ఫలములు భుజింపనిత్తును" అని ప్రకటన 2:7లో ప్రభువు సెలవిచ్చు చున్నారు. దేవుడు ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేసిన పాలు తేనెలు ప్రవహించు కానాను దేశము పరలోకము నకు సాదృశ్యముగా యున్నది. అట్లే దేవుని పట్టణమగు యెరూషలేము కూడ. అబ్రాహాము కూడ, "దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణకుడై యున్నాడో, పునాదులు గల ఆ పట్టణము కొరకు ఎదురుచూచుచుండెను" అని హెబ్రీ 11:10లో వ్రాయబడి యున్నది. యూదుల ఆరాధన స్థలమగు దేవాలయములో అతిపరిశుద్ధ స్థలము పరలోకమునకు సాదృశ్యముగా నున్నది. "అందువలన నిజమైన పరిశుద్ధ స్థలమును పోలి హస్త కృతమైన పరిశుద్ధస్థలములలో క్రీస్తు ప్రవేశింప లేదుగాని యిప్పుడు మనకొరకు దేవుని సముఖమందు కనబడుటకు పరలోకమందే ప్రవేశించెను" (హెబ్రీ 9:24). పరలోకము దేవుడు ఏర్పరచిన విశ్రాంతిని సూచించుచున్నది. "కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది. ఎందుకనగా దేవుడు తన కార్యములను ముగించి విశ్రమించిన ప్రకారము ఆయన యొక్క విశ్రాంతిలో ప్రవేశించిన వాడు కూడ తన కార్యములను ముగించి విశ్రమించును" అని హెబ్రీ 4:9,10లో వ్రాయబడి యున్నది.

తండ్రియైన దేవుడు, యేసుక్రీస్తు పరిశుద్ధాత్ముడు, దేవదూతలు ఉండే ప్రదేశము పరలోకము. యేసుక్రీస్తు అక్కడినుండియే దిగివచ్చి మరల అక్కడికే తిరిగి వెళ్ళెను. ఆయన యిట్లనెను : "నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్దనుండుటకు మిమ్మును తీసుకొనిపోవుదును" (యోహాను 14: 2,3). దీనిని బట్టి దేవుడు, దేవుని దూతలు ఉండే ప్రదేశమే కాకుండా పరిశుద్ధులు కూడా ఉండుటకు సిద్ధపరచబడిన ప్రదేశము పరలోకమని మనము గ్రహించుకొనగలము.

పరలోకము ఒక గొప్ప విలువ గల బహు సౌందర్య పట్టణముగా కూడ బైబిలునందు వర్ణించబడినది. "దేవుడు దేనికి శిల్పియు నిర్మాణకుడై

యున్నాడో. ఆ పట్టణము కొరకు అబ్రాహాము ఎదురుచూచుచుండెను (హెబ్రీ 11:10). దేవుడు తన పరిశుద్ధుల కొరకు ఒక పట్టణమును సిద్ధపరచియున్నారు (హెబ్రీ 11:16). అది నూతన యెరూషలేమను పరిశుద్ధ పట్టణము (ప్రకటన 21:2). దానియందలి వెలుగు ధగధగ మెరయు సూర్యకాంతము వంటి అమూల్యరత్నమును పోలియున్నది. ఆ పట్టణపు ప్రాకారము, దాని పునాదులు నానావిధరత్నములతోను, సూర్యకాంతములతోను కట్టబడెను. దాని 12 గుమ్మములు 12 ముత్యములు. పట్టణపు రాజవీధి శుద్ధసువర్ణమయమై స్ఫటికమును పోలియున్నది. దానిలో ప్రకాశించుటకు సూర్యుడైనను, చంద్రుడైనను దానికక్కర లేదు. దేవుని మహిమయే దానిలో ప్రకాశించును. గొర్రె పిల్లయే దానికి దీపము అని భక్తుడైన యోహాను ఆ పరలోక సౌందర్యమును మన మెరిగిన భూలోక పదములతో ఆత్మావేశముచే వర్ణించెను (ప్రకటన 21:10-26). అది మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు యొక్క నిత్య రాజ్యమని, అనగా దానికెన్నడును అంతముండదని 2 పేతురు 1:11లో వర్ణించబడినది.

పరలోకములో పాపముగాని, దుర్మార్గతగాని, దుష్టత్వముగాని, నిషిద్ధమేదయిననుగాని యుండదు. దుష్టులు, దుర్మార్గులు అందరు అగ్ని గంధకములతో మండు గుండములో పడవేయబడుదురు (ప్రకటన 21:8). నీతిమంతులందరు పరలోకములో యుందురు. “గొర్రెపిల్ల జీవగ్రంథమందు వ్రాయబడినవారే దానిలో ప్రవేశింతురు గాని నిషిద్ధమైనదేదైనను, అసహ్యమైన దానిని, అబద్ధమైన దానిని జరిగించు వాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు” (ప్రకటన 21:7). “ఇక మీదట శాపగ్రస్తమైన దేదియు దానిలో ఉండదు, దేవుని యొక్కయు, గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో ఉండును” (ప్రకటన 22:3). అందు వలన పరలోకము క్రొత్త ఆకాశము, క్రొత్త భూమియని చెప్పబడెను. దానిలో నీతి నివసించును (ప్రకటన 21:1;2 పేతురు 3:13).

పరలోకములో పరిశుద్ధత నివసించును, అందున్న వారి హృదయములలో గాని, జీవితములో గాని పాపము ఏమాత్రమును ఉండనేరవు (1 కొరింథి 1:8, యూదా : 24). పరలోకమందున్నవారు నిత్యము జీవింతురు. ఆ నిత్యజీవము ఇప్పుడున్న

ఈ జీవితము కంటే బహు శ్రేష్ఠమైనది. ఉత్కృష్టమైనది. అది అంతులేనిది. అందువలననే "మరణము వరకు నమ్మకముగా ఉండుము. నేను నీకు జీవకిరీటమిచ్చెదను" అను వాగ్దానమును ఆయన మనకు చేసెను (ప్రకటన 2:10; 1 యోహాను 2:25).

పరలోకమందు సుఖము, శాంతి, విశ్రాంతి లభించును. బీదవాడైన లాజరు చనిపోయి, అబ్రాహాము రొమ్మున ఆనుకొని నెమ్మది పొందుచున్నట్లు లూకా 16:25 లో వ్రాయబడినది, ప్రభువునందు మృతినొందువారు ధన్యులు, వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు; వారి క్రియలు వారి వెంటపోవునని పరిశుద్ధాత్ముడు ప్రకటన 14:13లో చెప్పుచున్నాడు.

పాపము, దాని ద్వారా కలుగు శాపము ఏమియు పరలోకమునందు ఉండదు. అక్కడ "ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును మరణము ఇక ఉండదు. దు:ఖమైనను ఏడ్పైనను, వేదనయైనను ఇక ఉండదు" (ప్రకటన 21:4). మరణము, దు:ఖము, ఏడ్పు, వేదన ఇవన్నియు ఎందువలన వచ్చెను ? అవన్నియు పాపము వలన సంభవించెను. పాపము నాశనము చేయబడి, దానినుండి విమోచన సంపాదించబడిన తరువాత పాపపు శాపము కూడ నాశనము చేయబడును. పాపము యొక్క ప్రభావము ఇసుమంతయు కూడా లేని ఆ ప్రదేశమందు నిత్యము జీవించగలుగుట యెంత గొప్ప భాగ్యము!

ఏదేనువనములో యుండునట్టి ప్రశాంతత పరలోకములో యుండును. జీవజలనది పరలోకమందలి రాజవీధి మధ్య ప్రవహించును. ఆనది యొక్క ఈవలను, ఆవలను జీవవృక్షముండును; శాపగ్రస్థమైన దేదియు దానిలో ఉండదు అని ప్రకటన 22:1-3లో వ్రాయబడి యున్నది.

పరలోకము అత్యానంద భరిత ప్రదేశమని మనకు యేసుక్రీస్తు హామీ నిచ్చెను. ప్రభువు తన కిచ్చిన తలాంతులను ఆయన మహిమ కొరకు వినియోగించిన ప్రతివానిని ఆయన చూచి, "భళా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు ఈ కొంచెములో నమ్మకముగా ఉంటివి, నిన్ను అనేకమైన వాటిమీద నియమించెదను. నీయజమానుని సంతోషములో పాలుపొందుమని" చెప్పును (మత్తయి 25:21).

పరలోకమందున్న వారు

ప్రభువును ఎల్లప్పుడు స్తుతించెదరు. ఏలయనగా మహిమా ప్రభావములు ఆయనకే చెందును (ప్రకటన 19:1). వారు దేవుని సింహాసనము ఎదుట ఉండి రాత్రింబగళ్ళు ఆయనను సేవించుదురు (ప్రకటన 7:15).

పరలోకములో ఎవరెవరు ఉందురు? అను ప్రశ్నకు ప్రకటన 22:3,4లో ఇట్లు వ్రాయబడియున్నది: "దేవుని యొక్కయు, గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో నుండును; ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖ దర్శనము చేయుచుందురు; ఆయన నామము వారి నొసళ్ళయందుండును". అంతేగాక దేవునికి నమ్మకముగా జీవించిన గోత్రకర్తలు అక్కడ యుందురు: "అనేకులు తూర్పునుండియు పడమట నుండియు వచ్చి అబ్రాహాముతో కూడను, ఇస్సాకుతో కూడాను, యాకోబుతో కూడాను పరలోక రాజ్యమందు కూర్చుందురు" అని మత్తయి 8:11లో యేసు చెప్పెను. మరియు గొర్రెపిల్ల యొక్క జీవగ్రంథములో వ్రాయబడిన పేర్లుగల వారే పరలోకములో యుందురు (ప్రక 21:27). అట్టివారు జీవవృక్షమునకు హక్కు గలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను క్రీస్తు యొక్క రక్తములో ఉదుకుకొనినవారై యుందురు (ప్రక 22:14).

పరలోకము యొక్క గంభీరతను, సౌందర్యమును, ఘనతను వర్ణించుట నాకు గాని మరి యేమానవునికి గాని సరిపడదు. మనలో ఎవడును నశింపకుండ అందరును పరలోకమునకు వెళ్ళునట్లు యేసుక్రీస్తు మనందరి కొరకు సిలువపై మృతి పొందెను. ఆయనయందు విశ్వాసముంచి, మన పాపములను విసర్జించి, పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తునామములోనికి ఇప్పుడు మనము బాప్తిస్మము పొందిన యెడల ఆయన మనలను తప్పక రక్షించును. అంతేగాకుండ మరణపర్యంతము నమ్మకముగా యున్న యెడల ఆ పరలోక రాజ్యములో మనలను ఆయన తప్పక చేర్చుకొనును. నీవు పరలోకమునకు వెళ్ళుటకు ఆశించుచున్నావా?

# అన్యాయస్థుడైన తీర్పరి
## (The Unjust Judge)

లూకా 18:1-8

**పరిచయము :**

దేవుని రాజ్యమెప్పుడు వచ్చునని పరిసయ్యులు విమర్శనాత్మకముగా యేసును ప్రశ్నించిరి (లూకా 17:20). అందుకాయన "దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు. ఎందుకనగా ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది. గనుక ఇదిగో ఇక్కడనని, అదిగో అక్కడనని చెప్ప వీలుపడదని వారికి ఉత్తర మిచ్చెను" (లూకా 17:20-21).

22-37 వచనములలో శిష్యులకు యేసు తన రెండవ రాకడను గూర్చి వివరించెను. తదుపరి వారికి అన్యాయ స్థుడైన తీర్పరిని గూర్చిన ఉపమానము చెప్పెను. దీనిలో ముఖ్యపాత్ర తీర్పరిది కాదు గాని, విసుగక నిత్యము ప్రార్థన చేయు విధవరాలిది. ఈ తీర్పరి తప్పనిసరి పరిస్థితుల్లో తీర్పు తీర్చును గాని దేవుడైతే తన చిత్త ప్రకారము త్వరలో తీర్పుతీర్చును.

ఈ ఉపమానము ప్రార్థనను గూర్చి చెప్పబడినది. యేసు యొక్క గొప్ప సువార్త పరిచర్య ప్రార్థనతో ఆరంభిం పబడెను. యేసు బాప్తిస్మము పొందినప్పుడు ప్రార్థన చేయుచుండగా పరిశుద్ధాత్మ ఆయనపై దిగినట్లు లూకా వ్రాసాడు (లూకా 3:21). ఆయన 12 మంది శిష్యులను ఏర్పరచుకొనకముందు రాత్రంతయు ప్రార్థనలో గడిపెను (లూకా 6:12-13). కైసరుదైన ఫిలిప్పుయిలో పేతురు ఒప్పుకోలు చేయకముందు ఆయన ప్రార్థన చేయుచుండెను (లూకా 9:18). యేసుకొండ మీద రూపాంతరము పొందినప్పుడు ప్రార్థన చేయుచుండెనని కూడ లూకా వ్రాసాడు (లూకా 9:28). ప్రార్థించుచున్న యేసుయొక్క చిత్రము లూకాకును ఆదిమ సంఘముకును ప్రాముఖ్యము. యేసు ప్రార్థించవలసివస్తే, ఆదిమ సంఘము ప్రార్థించవలసివస్తే మనకు ప్రార్థన ఇంకెంత అవసరము !

ఈ ఉపమానము, పరిసయ్యుడు సుంకరి యొక్క ఉపమానము లూకా సువార్తలో మాత్రమే కన్పడును. అవి చెప్పబడకముందు వాటి ప్రయోజనము కూడా ముందుగానే ఈ రెంటిలోను

చెప్పబడెను. ఇవి రెండు ప్రార్థనను గూర్చి చెప్పబడిన ఉపమానములు.

**ప్రార్థన యొక్క అవశ్యకత :**

క్రైస్తవ జీవితములో ప్రార్థన అత్యవసరమైనది, అది దైనందిన అలవాటు. ప్రార్థన ఫలితము కొరకు మనము దిగువ సంగతులను గమనించాలి : 1) దేవుడు మన ప్రార్థనలను షరతులతో వినును - ఆయన మాటలు వినువారి మాటలను ఆయన వినును - (లూకా 6:46; మత్త 7:21; సామె 28:9). 2) సరియైన ఆత్మ కలిగి ప్రార్థించాలి (లూకా 22:42; ప్రక 22:17). 3) విశ్వాసముతో ప్రార్థించాలి (యాకో 1:5-8). 4) ఆయన చిత్త ప్రకారము ప్రార్థించాలి (1 యోహా 5:14, లూకా 22:41, 42). 5) నీతిమంతుల ప్రార్థన ఆయన వినును (1 పేతురు 3:12). 6) క్షమించు వారి ప్రార్థన ఆయన వినును (మత్తయి 6:12-15-7) పాపుల మనవి ఆయన ఆలకింపడు (యోహా 9:31; కీర్త 66:18).

**ఉపమానము :**

"వారు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను. దేవునికి భయపడకయు, మనుష్యులను లక్ష్య పెట్టకయు నుండు ఒక న్యాయాధిపతి యొక పట్టణములో యుండెను. ఆ పట్టణములో ఒక విధవరాలుండెను. ఆమె అతని యొద్దకు తరుచుగా వచ్చి - నా ప్రతివాదికిని నాకును న్యాయము తీర్చుమని అడుగుచు వచ్చెనుగాని అతడు కొంతకాలము ఒప్పకపోయెను. తరువాత అతడు - నేను దేవునికి భయపడకను మనుష్యులను లక్ష్యపెట్టకయు ఉండినను ఈ విధవరాలు నన్ను తొందర పెట్టు చున్నది గనుక ఆమె మాటి మాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్తునని తనలో తానను కొనెను. మరియు ప్రభువిట్లనెను - అన్యాయస్థుడైన అన్యాయాధిపతి చెప్పిన మాట వినుడి. దేవుడు తాను ఏర్పరచు కొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొఱ్ఱ పెట్టుకొనుచుండగా వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును, వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడని మీతో చెప్పుచున్నాను. అయినను మనుష్యకుమారుడు వచ్చు నప్పుడు ఆయన భూమిమీద విశ్వాసము కనుగొనునా?" (లూకా 18:1-8).

ఈ ఉపమానము యొక్క ఆరంభములోనే అదిదేని నిమిత్తము చెప్పబడుచుండెనో తెలియజేయబడెను. వారు విసుగక నిత్యము ప్రార్థన చేయుచుండవలెను. అందువలన ఈ ఉపమానములో తదుపరి సంగతులన్నీ ఎడతెగక ప్రార్థన చేయవలసినదను సంగతిపై ఆధారపడియే యున్నవి. ఇందులో ముఖ్య పాత్ర తీర్పరిదికాదు గాని, అతనిని గోజాడు విధవరాలిదే. తీర్పరి విజ్ఞాపనలను విను దేవునికి సాదృశ్యముగా యున్నాడు. ఈ న్యాయాధిపతివలె గాక దేవుడు ప్రార్థనలను ప్రోత్సహించును, ప్రార్థించాలని కోరును. మరియు న్యాయాధిపతియు దేవుడును చలించు కారణములు వేర్వేరుగ యుండును.

ఈ ఉపమానములో పరిచయము చేయబడిన న్యాయాధిపతి ఒక్కడే. అతడు బహుశా రోమియుడై యుండవచ్చును. అతడు దేవునిని మనుష్యులను కూడ లక్ష్య పెట్టువాడు కాడని పరిచయం చేయ బడినది. దేవునికి భయపడనివాడు సహజముగా మనుష్యులను కూడ లక్ష్యపెట్టడు (క్రీర్తన 14:1; రోమా 3:5-18). అతని కనుగ్రహింపబడిన స్థానమునకు అతడు అర్హుడు కాడు.

తదుపరి ఒక విధవరాలు పరిచయం చేయబడినది. చట్ట ప్రకారము ఆమె న్యాయమును కోరినది. అయితే పొరబాటు న్యాయవ్యవస్థలో గాక న్యాయాధిపతిలోనే యుండెను. ఆమె యొక్క సమస్య యదార్థమైనదే. ఆమె తన ప్రతివాదికిని తనకును న్యాయము తీర్చు మని అతని అభ్యర్థించుచు వచ్చినది. యూదా మతము ద్వారా దేవుడు విధవరాండ్రకు, అనాథలకు ప్రత్యేకమైన భద్రత ఏర్పాటు చేసెను (ద్వితీ 10:18, 14:29; 24:17, 19-21; 26:12-13; కీర్త 68:5; 146:9 సామె 15:25; యెషయా 1:17; యిర్మీ 22:3; మలాకీ 3:5). "విధవరాలినైనను దిక్కులేని పిల్లలనైనను బాధపెట్టకూడదు. వారు నీచేత ఏవిధముగానైనను బాధగొలిపి నాకు మొర్ర పెట్టినయెడల నేను నిశ్చయముగా వారి మొరను విందును. నా కోపాగ్నిరవులుకొని మిమ్మును కత్తిచేత చంపించెదను, మీ భార్యలు విధవరాండ్రగుదురు, మీ పిల్లలు దిక్కులేని వారగుగుదురు" (నిర్గమ 22 : 22-24).

ఈ న్యాయాధిపతి ఆమె చేత విసిగించబడినందున ఆమెకు చివరకు

తీర్పు తీర్చెదననుకొన్నాడు. అతడు దేవునికి భయపడువాడు కాదు (లూకా 18:4). మనుష్యులను లక్ష్యపెట్టు వాడుకాదు, అతడు న్యాయవంతుడై సందున చివరకు తీర్పుతీర్చ లేదుగాని, ఆమెచేత ఇంక విసిగించబడకుండుటకు తీర్పు తీర్చెను (లూకా 18:5).

లూకా 18:6-8లో యేసు అన్యాయస్థుడైన న్యాయాధిపతికిని పరమందున్న తండ్రికిని యున్న తారతమ్యము చూపించెను. న్యాయాధిపతి అయిష్టముగానే చలించినను. దేవుడు తన్ను ఏర్పరచుకొనిన వారికి సంతోషముతో, యిష్టపూర్వకముగా న్యాయము తీర్చును. దేవుడు తనవారి ప్రార్థనలకు ఉదాసీనుడు కాడు. సరిగదా ప్రార్థనలకు జవాబిచ్చువాడు. "ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును: వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడని" 8వ వచనములో ఆయన చెప్పెను. ప్రార్థన ఎడతెగక యుండాలి. ఈ ఉపమానము యొక్క ముఖ్య ఉద్దేశ్యము అదే.

బైబిలు గ్రంథ మంతటిలోను ప్రార్థనను గూర్చి చెప్పబడినది. దిగువ కొన్ని రిఫరెన్సులు ఇయ్యబడినవి.

"భక్తిహీనులు అర్పించు బలులు యెహోవాకు హేయములు, యథార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము" (సామె 15:8).

"భక్తిహీనులకు యెహోవాకు దూరస్థుడు, నీతిమంతుల ప్రార్థన ఆయన అంగీకరించును" (సామె 15:29).

"నేను మీతో చెప్పునదేమనగా పరలోకమందున్న మీతండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి" (మత్తయి 5:44).

మత్తయి 7:11లో ఇహలోక తండ్రికి పరలోక తండ్రికి యున్న తారతమ్యము చూపించబడినది. "మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి ఈవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా మంచి యీవులనిచ్చును" (మత్తయి 7:10-11).

- లూయిస్ రష్‌మోర్

## బలి కొరకు అవుసరమైన జంతువులు
## (The animals required for Sacrifices)

### దేవుని బల్యర్పణ పద్ధతి - 5

అన్ని బలులకు కావలసిన జంతువులన్నిటికి కొన్ని ప్రత్యేక లక్షణములుండవలెను. అవి ప్రత్యేకమైన స్థాయిలో యుండవలెను. మొట్టమొదటి లక్షణం యేమంటే అవి పెంపుడు జంతువులై యుండవలెను. అవి సాదువులైయుండవలెను. ఈ బలుల నిర్వహణ విషయంలో దేవుడు యిచ్చిన ఆజ్ఞలను పాటించవలెనని ఈ నిబంధన బలులు సూచించుచున్నవి. నిబంధన బలుల విషయమైన ఆలోచనను ఆదికాండము 15:8-17లో మనము కనుగొన గలము దేవుడు కోరిన బలులను అబ్రాహాము అర్పించాడు.

ఆ బలులద్వారా దేవుడు అబ్రాహాముతో తన నిబంధనను చేసికొనియున్నారు. అర్పించబడవలసిన జంతువులేవనగా, "ఆయన మూడేండ్ల పెయ్యను, మూడేండ్ల మేకను, మూడేండ్ల పొట్టేలును. ఒక తెల్లని గువ్వను, ఒక పావురపు పిల్లను నా యొద్దకు తెమ్మని" అబ్రాహామును కోరెను (ఆది.కా. 15:9). ఇవన్నియు అబ్రాహాము మందలోనివే, అనగా అతడు పెంచి పోషించుచున్నవే.

అర్పించబడే జంతువులు మొదటిగా సాదు జంతువులై యుండవలెను. అవి మందలో పెంచబడినవై యుండవలెను. అనగా బలిగా అర్పించు వానికిని ఆ జంతువులకును గల సన్నిహిత సంబంధమును అది తెలియజేయుచున్నది. అంటే వేటాడి పట్టుకొని వచ్చిన జంతువులు మాత్రము బలికి పనికిరావు, అవి క్రూరజంతువులు కాకూడదు. అడవి జంతువులు కాకూడదు.

రెండవది అవి పవిత్రజంతువులై యుండవలెను. ఏలయనగా అర్పింపబడే జంతువులేమి, పక్షులేమి యేసు క్రీస్తుకు అవి సాదృశ్యముగా యుండునట్టివి. యేసుక్రీస్తు అయిష్టముగా కల్వరి సిలువకు కొనిపోబడలేదు. మోషేధర్మ శాస్త్ర ప్రకారము బలిగా అర్పించబడేవి సందర్భరీత్యా నిస్సహాయమైన స్థితిలో యుండెను. వాటికి దేవుని ధర్మశాస్త్రము గాని, పాపము గాని, పాపపరిహారమును గూర్చిగాని యేమీ తెలియదు. బలిగా అర్పించబడేవి అమాయకమైన మూగ జంతువులు. బలి విషయంలో అవి యేమీ ఎరుగవు. అయితే యేసుక్రీస్తు యొక్క తత్వము అదికాదు. ఆయన బలవంతముగా, అయిష్టతతో అజ్ఞానముతో అర్పింపబడిన బలి

'పశువు' కాదు.

బలిగా అర్పింపబడే జంతువు సాదువుచేయబడినట్టిదై యుండవలెను. అది పవిత్రజంతువై యుండవలెను ఏలయనగా అది యేసుక్రీస్తు యొక్క ఆత్మీయ పవిత్రతను సూచించును. అది పవిత్రజంతువనగా శాఖాహార (వృక్షజాతి సంబంధ) మును గైకొనునట్టిది. అది మాంసాహార జంతువు కాకూడదు. సింహము, రాబందు, మాంసమును భక్షించు పక్షిగాని, జంతువుగాని యేసు క్రీస్తుకు సరియైన సాదృశ్యముకానేరదు. మాంసాహార జంతువులు వేరొక జంతువు ప్రాణమును గైకొని జీవించును. అయితే యేసుక్రీస్తు తన ప్రాణమునర్పించారు గాని వేరొకని ప్రాణమును గైకొనలేదు.

గనుక ఆ బలి పశువు సాదువు చేయబడిన, పవిత్రమైన, శాఖాహార సంబంధమైనదై యుండవలెను. యాజకులు ఆ బలిపశువులకు ఏమైనా లోపమున్నదేమో యని నిశితంగా వాటిని పరీక్షించేవారు. భౌతికంగా అవి మచ్చ లేనివై యుండవలెను. ఏలయనగా అవి యేసుక్రీస్తు యొక్క ఆత్మీయ పరిపూర్ణతను, పరిశుద్ధతను సూచించుచుండెను. లోపమువలన బలికి నిరాకరించబడే వాటివిషయము తెలిసికొనుటకు లేవీ 22:20 నుండి చదువండి. అర్పింపబడే జంతువు దోషము లేనిదై యుండవలెను. గ్రుడ్డిదేమి కుంటిదేమి, కొరతగలదేమి, గడ్డలు గలదేమి, గజ్జి రోగము గలదేమి, చిరుగుడు గలదేమి, అట్టి వాటి వేమియు యెహోవాకు అర్పింపకూడదు (లేవీ 22:22).

సాధారణంగా మగ జంతువు బలి కొరకు ఎంచుకోబడెను. ఏలయనగా పోతుజంతువు బలముకు, శక్తికి గురుతుగా యుండెను. అయినను కొన్నిసార్లు ఆడజంతువు కూడ అర్పింపబడవచ్చునని దేవుడు తెలియజేసెను. ఏలయనగా అది సంతానమునకు సాదృశ్యముగా యుండెను. శాఖాహార విషయములోనైతే సాధారణముగా ధాన్యములు అర్పింపబడేవి. అవి మొక్కలు, ధాన్యములు, ఫలరసములు మొదలగునవి. అంటే యివి ఒకనిచే పండించబడిన వస్తువులు. మానవునికి ఆహార విషయంలో పనికి వచ్చేవి. అవి వాటికవే మొలిచినవికాదు. అడవిలో మొలిచినవి కాదు, కొండలలో పెరిగినవి కాదు. అవి మనుష్యుని యొక్క కృషిలోని ప్రధమ ఫలములై యుండవలెను.

దహన బలిలో నిజానికి మానవుడు సాదృశ్యరూపముగా తన్నుతాను దేవునికి అర్పించుకొంటాడు. "నేనేమై యున్నానో, నా సమస్తము దేవునికి అర్పించుచున్నాను" అన్నట్లు అతడుండును.

అయితే ప్రధమఫల అర్పణలో అతని కున్నదంతయు దేవునికి ప్రతిష్ఠించు చున్నాడు. పండించబడిన ధాన్యములు ఎన్నడు వాటి ముడి రూపములో అర్పింప బడేవికావు. అవి మార్చబడాలి లేదా పేల్చబడాలి. సాధారణంగా అవి రొట్టెల వలె లేక అప్పములవలె చేయబడి దహన బలిపీఠము మీద దేవునికి అర్పించబడేవి. ఈ బలులన్నియు ఇశ్రాయేలీయులకు లోతైన ఆత్మీయ భావార్ధములననుగ్ర హించెను. వారి భక్తి విశ్వాసములను ప్రదర్శించుటకు దేవుడు వారికి అనేక తరుణములను అనుగ్రహించెను.

**మిస్బా – బలిపీఠము** – Mizbah, the altar

దేవునికి అర్పణలు అర్పింపబడే బలిపీఠము ప్రత్యక్షగుడారము యొక్క ఆవరణములో యుండెను. అది దహన బలి పీఠము (The altar of Burnt offerings). ఆరాధన అర్పణలు, పరి హారార్ధ బలులు దహన బలిపీఠము మీదనే అర్పింపబడవలెనని దేవుడు సూచించెను. బలిపీఠమును హెబ్రీభాషలో మిస్బా అందురు. వధించబడు స్థలము అని దాని యర్ధము. ఏవ్యక్తి అయినా ఏసమయములోనైనా దేవునికి ఏదైనా అర్పణ అర్పించాలనుకొంటే, దానిని బలిపీఠముపై దహించుటయే తప్ప వేరొక మార్గము లేదు. దానిని దహించుట ద్వారా తన్నుతాను అర్పించు కొన గోరినప్పుడు అతడు దహనబలి పీఠముపై తన్నుతానుం డాలి లేదా తనకు బదులు గా వేరొక దానిని దానిపై యుంచి దహించాలి.

పరిహారార్ధమై అర్పింపబడిన జంతువు యొక్క రక్తము బలి పీఠముపై యుంచాలి. బలులన్నిటిలో నుండి తీయబడిన క్రొవ్వు బలిపీఠముపై దహించగా అది ఇంపైన సువాసనగా పరముసకేగేది. ధాన్యదులు గాని, మరింకేమైనా గాని బలిపీఠముపై నుంచబడి దహించబడి ధూమ రూపమున పరలోకమునకు పంపబడేవి. రసములు, ద్రావకములైతే బలిపీఠము మీద పోయబడేవికావు గాని దాని క్రింద పోయబడి యెహోవాకు అర్పింప బడేవి గనుక అర్పణలన్నీ బలిపీఠము యొద్దనే దేవునికి అర్పించబడాలి.

నిర్గమ 20:24-25లో ఇశ్రాయే లీయులు దేవునికి బలిపీఠమును కట్టవలెనని ఆయన సెలవిచ్చెను. అది మలిచిన రాళ్లతో కట్టకూడదు. దానికి పనిముట్టు యేదీ తగిలించ కూడదు. దానిని అందముగా చెక్కుటకు ఎట్టి ప్రయత్నము చేయకూడదు. బలిపీఠము యొక్క అందమును బట్టి గాని, సైజును బట్టి గాని దేవుడు ఇశ్రాయేలీయులను అంగీకరించడు, గాని వారి హృదయ పరిస్థితిని బట్టి దేవుడు వారిని అంగీకరిం

చును. "నేనునీ యొద్దకు వచ్చి నిన్ను ఆశీర్వదించెదను" అని దేవుడు ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేసెను. ద్వితీ 12:5-6లో ఇశ్రాయేలీయులు తమ దహనబలులను, బలులను, దశమ భాగములను, నైవేద్యములను, అర్పణలను బలిపీఠమునొద్దకే తేవలెనని నియమించెను. అది ఆయన నామమును స్థాపించుకొనుటకు దేవుడు తన నివాసస్థానముగా ఏర్పరచబడిన స్థలము. అక్కడ ప్రత్యక్ష గుడారములో యెహోవా దేవుడు తన నామము నేర్పరచెను.

**అగ్ని యొక్క ప్రాముఖ్యత :**

ఈబలి పీఠములపై అర్పణలను, బలులను దహించు అగ్ని ఒక్కటే, గాని అది రెండు పదములతో వర్ణించబడినది. ఆరాధనలో అర్పింపబడిన వస్తువులను దహించు అగ్ని విషయంలో Katar అను హెబ్రీపదము వాడబడినది. ఈ అగ్ని అర్పణలను, బలులను దేవుని యొద్దకు చేర్చుటకుపయోగపడేది. దేవునికి ఇంపైన సువాసన గల బలులన్నిటి విషయములో Katar అను పదము వాడబడినది. ఈ అగ్నిబలులను దహించివేయనన్నట్లు గాక, వాటిని దేవుని సాన్నిధ్యమునకు కొనిపోవునన్నట్లు ఉద్దేశించబడినది. Kater అను హెబ్రీపదముకు పవిత్ర పరచుట (to cleanse) అనుభావ మున్నది.

పాపపరిహారార్థ బలులను దహించు అగ్నివిషయములో వేరొక మాటవాడ బడినది. కొన్ని పాపపరిహారార్థ బలులు, పరిహారార్ధదినమున వధింప బడిన బలులు మొ॥నవి దహించబడి నప్పుడు హెబ్రీ భాషలో Searaph అను పదము వాడబడి నది. యిది Seraphim అను మూలపదము నుండి కలిగినది. సెరాఫీములు దేవుని పగతీర్చుకొనుదూతలు. వారు సొదొమ, గొమొఱ్ఱాలపై అగ్నిని కురిపించిన వారు, గనుక ఈ అగ్ని దేవుని స్తుతించుటకు, భక్తిని ప్రదర్శించుటకు వాడబడినది కాదు. ఈ అగ్ని పాపముపై దేవుని తీర్పుకొరకు దేవుని నుండి దిగివచ్చినట్టిది. అగ్ని అగ్నియేదైనా బలుల విషయములో రెండురకములైన అగ్ని మనకు గోచర మగుచున్నది.

లేవీ 10:1 లో మూడవ రకమైన అగ్నిని గూర్చి బహుశా చెప్పబడినది. నాదాబు అబీహులను యాజకులు దేవుడు ఆజ్ఞాపింపని వేరొక అగ్నిని వినియోగించిరి. వేరొక అగ్ని (Strange fire) అనగా దేవుడు ఆజ్ఞాపించనిది, అనుమతించనిదియని మనము గ్రహించాలి. తమ బలులు అర్పణలు అర్పింపబడవలసిన విధానమును దేవుడు తెలియజేసారు. ఆయన యిచ్చిన నియమములు ఎన్నడైనా ఉల్లఘించబడితే, దానిని బట్టి ఆరాధన వ్యర్ధమగుటయే గాక, వారి బలి కూడ వ్యర్ధమాయెను.

ఉల్లంఘించిన వ్యక్తిని అది దేవుని ఉగ్రతకు నేరుగా పాత్రుని చేసెను.

**అచారకర్మలు ప్రసార సాధనములు :**

ప్రతి బలియొక్క సంస్కార విధానము వేరు బలులన్నియు ఆచారకర్మ లుగా ఎంచుకొనుట సులభముగానే యుండును. ప్రతి బలి యొక్క విధానము, బలివశువు వలె ప్రత్యేకత కలిగి యున్నది.ప్రతి బలిలోను యున్న ఆచార విధానము కొంతమట్టుకు ఒకేలాగున యున్నట్లగుపడును.

పరిహారబలులలో రక్తము ఎక్కడ చిలకరించబడెను? బలిగా అర్పింపబడిన దాని శరీరము ఏమగును ? అది సంపూర్తిగా దహించబడునా ? కొన్ని బలుల విషయమైతే నాడు విధిలోయున్న యాజకుడు భుజించేవాడు. ఈ రీతిగా దేవుడు యాజకుని గౌరవించేవారు ఏలయనగా అతిక్రమము చేసిన మానవునికి దేవునికి మధ్య అతడుండి సహవాసము పునరుద్ధరించబడునట్లు అతడు పని చేసాడు. కొన్ని బలుల విషయమైతే ఆకాశమునుండి అగ్నివచ్చి వాటిని దహించివేసేది. చేయబడిన పాపము విషయమై ఈ రీతిగా దేవుని ఉగ్రత ప్రదర్శించబడేది.

ఇంపైన సువాసనగల బలుల అర్పణ విషయములో ఆరాధకుని పాత్ర యేమిటి? అతడు ఈ విషయంలో ఎంత ముందుకు పోవచ్చును? అతడు వెనుదిరిగి యాజకునికే ఆపని అప్పగిం పాలా ? పాపపరిహారార్థ బలులర్పించు నప్పుడు పాపి ఎంత మట్టుకు వెళ్ల వచ్చును ? ఇవన్నియు మోషేధర్మ శాస్త్ర ప్రకారము అర్పింపబడే బలుల విషయములో ముఖ్యమైన భాగములు. అవి మనకు ఆచారకర్మలుగా అగుపడు చున్నను, వాటన్నిటిలో గొప్ప లోతైన ఆత్మీయ భావములుకలవు. హెబ్రీయుల హృదయములలో వాటి ఆత్మీయ భావములు, విలువలు గొప్పవి.

***సత్యవాణి టి.వి కార్యక్రమములు :***

ప్రతి ఆదివారం సాయం **6గం॥లకు శుభవార్త**
ప్రతి బుధవారం సాయం **6:30 గంటలకు రక్షణ**
ప్రతి గురువారం ఉదయం **11:00 గం॥లకు రక్షణ**

www. satyavanicoc.com.

# కీర్తనలు పాడుట
## (Singing)

పస్కాపండుగ నాడు ప్రభురాత్రి భోజనమును ప్రతిష్ఠించి దాని సంబంధమైన హెచ్చరికల నిచ్చిన తరువాత మన ప్రభువు తన అపోస్తలు లతో కలిసి కీర్తనపాడెను. "అంతట వారు కీర్తనపాడి ఒలీవల కొండకు వెళ్లిరి" (మత్తయి 26:30). వారేమి పాడారో మనకు తెలియదు. వారిపాటలను ఎవరునడిపించారో కూడ మనకు తెలియదు.

పౌలు, సీలాలు ఫిలిప్పయి చెరసాలలో బంధింపబడియుండిరి. వారి కాళ్లకు బొండాలు బిగింపబడి యుండగా వారు పాటలు పాడు చుండిరి. ప్రార్థన చేయు చుండిరి. మరియు తోటి ఖయిదీలు విను చుండిరి (అపొ.కా. 16: 24-25).

"మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా ? అతడు ప్రార్థన చేయ వలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను. (యాకోబు 5:13). మనము మనస్సుతోను, ఆత్మతోను పాడవలెను అనగా పాట యొక్క అర్థమును గ్రహించుకొని పాడవలెను (1 కొరింథీ 14:15). మనము కీర్తనలు, సంగీతములు, ఆత్మసంబంధమైన పాటలు పాడవలెను (ఎఫెసీ 5:19; కొలస్స 3 :16).

క్రైస్తవ్యము పాటలు పాడే మతము. క్రొత్తనిబంధనలో ప్రతి క్రైస్తవుడు, క్రైస్తవురాలు యాజకునిగా, యాజకరాలుగా పాటలు పాడవలెను. అది ఎన్నడు వాద్యములతో మిళితము చేయబడలేదు. నాడు నేడు కూడ క్రైస్తవులు పాటలుపాడే ప్రజలే.

పాటలు పాడుటలో యున్న శక్తి గొప్పది. అది సజీవ స్వరము. వాద్యము లునిర్జీవ వస్తువులు, ఆరాధనలో పనిలో, ఆటలో పాటలు పాడుట ఘనమైనది దేవుడు కోరేది అదే.

– కేరల్ సైట్స్

# నేనిచ్చే కానుకలు
## (My Giving)

"భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును యెహోవావే" (కీర్తన 24:1).

సమస్తమును మనదేవునికి చెందినవే గనుక ఆయనకు యేమీ అవుసరము లేదు. ఔదార్యము గల ఆయన నుండియే మనకు అన్ని యీవులు కలుగును (యాకోబు 1:17). అది నిజమే అయినను ఆయనను సేవించువారి నుండి ఆయన కానుకలు కోరడం వింత అనిపించవచ్చును. ఆయన మన నుండి ఆత్మీయ సేవను కోరుచున్నందున మనము ఆయనకు కానుకలు ఇవ్వాలని కోరుచున్నారు. ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆయనను ఆరాధించవలెను. కానుకలిచ్చుట ఒక ఆత్మీయమైన విషయం! దేవునికి, ఆయన పనికి యిచ్చుట మన హృదయాన్ని, భక్తిని, మన అభీష్టాన్ని తెలియజేయును.

మన ధనం మన హృదయానికి దగ్గరగా యుంటాది గనుక దానిని యిచ్చుటలో దేవునితో మనకు గల సంబంధాన్ని తెలియజేయును. "నీధన మెక్కడనుండునో అక్కడనే నీ హృదయము ఉండును" అని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 6:21). మనం యిచ్చే కానుకలను దేవుని దృక్కోణం నుండి గమనించుము.

**మన కానుకలు దేవునికిచ్చే అర్పణలై యున్నవి :**

దేవునికి బహుమానములు, సమర్పణలు చెల్లించుట కయీను, హేబెలుల కాలము నుండి యున్నవి. అబ్రాహాము యుద్ధములో కొల్ల సొమ్ములో పదియవవంతును దేవుని యాజకుడైన మెల్కీసెదెకు సమర్పించాడు (ఆది.కా. 14:17-20). తనకు కలిగిన దానిలో పదియవవంతు దేవునికిత్తునని యాకోబు మ్రొక్కుకొనెను (ఆదికా. 28:22). ప్రత్యక్షగుడారము నిర్మించబడుచున్నప్పుడు దేవుడు ప్రజలనుండి అర్పణలుకోరెను. మరియు ప్రజలు తమ ఆదాయములో పదియవవంతు దేవునికియ్యవలెనని, దానిని లేవీయులకు సమర్పించవలెనని ఆయన ధర్మశాస్త్రములో హెచ్చరించెను. మనం దేవునికిచ్చే యర్పణ వ్యక్తిగతమైనదని, అది దేవుని యెడల మనకున్న భక్తి భావములను ప్రదర్శించునని ప్రవక్తయైన మలాకీ విశద పరచెను. గనుక దేవుని దృష్టిలో

ఎంతమట్టుకు ఘనపరచుచున్నామో మన యర్పణలు తెలియజేయును. మన యర్పణలు వ్యక్తిగతం !!

**మన యర్పణలు విధేయతకుసూచికలు:**

మోషేధర్మ శాస్త్రము వివిధ రకముల యర్పణలను గూర్చి ఆజ్ఞాపించెను. ప్రవక్తల ద్వారా దేవుడిట్లు ఆజ్ఞాపించాడు: "పదియవ భాగమంతయు మీరు నామందిరపు నిధిలోనికి తీసికొనిరండి" (మలాకీ 3:10). మన ఆరాధనలలో దీనిని గూర్చి ప్రార్థించుట మనము తరచుమరతుము. మన సేవలో ఎప్పుడు ఇయ్యాలో మన అనుకూలతను బట్టి నిశ్చయించుకొనవచ్చును. గాని కానుకలిచ్చుట మన అనుకూలత కాదు గాని మన ప్రభువైన యేసుయొక్క ప్రభుత్వమునకు చూపించే విధేయత అది. కొరింథులో యున్న సంఘము ప్రతి ఆదివారమున కానుకలియ్యాలని పౌలువారిని హెచ్చరించాడు (1 కొరింథీ 16:1,2). గలతీయలోని సంఘములకును దీనిని అతడు బోధించాడు. యిచ్చుట మన బాధ్యతయై యున్నదని బైబిలు గ్రంథమంతయు బోధించుచున్నది. ఎంత ఇయ్యాలో క్రొత్తనిబంధనలో ఆయన చెప్పలేదు గాని, మనం అభివృద్ధి జెందిన కొలది, హృదయములో నిశ్చయించుకొని ధారాళముగా ఇయ్యవలెనని చెప్పారు (2 కొరింథీ 9:6-7).

మన యర్పణ ఒక పెట్టుబడి లాంటిది : కోతకోయుదుమనే నిరీక్షణతో విత్తుట అది. మనం ఆత్మీయ విషయాలలో పెట్టుబడి పెడితే నిత్య జీవితాన్ని కోయుదుము (గలతీ 6:6-8). విస్తారముగా విత్తువాడు ధారాళముగా పంట కోయును. మనం యిచ్చే కానుకలు పరలోకమందు ధనము కూర్చుకొనుటయే.

దేవుని పనిలో సహవాసము కొరకు మనయర్పణలున్నవి : ఫిలిప్పయిలోని క్రైస్తవులు తమ కానుకల ద్వారా తనతో మొదటి నుండి సహవాసము కలిగి యుండిరని పౌలు వారికి తెలియజేసాడు (ఫిలిప్పీ 1:3-7). నిరు పేదలకు సహాయము చేయుటకు మాసిదోనియలోని సంఘములు ఎంతో ఆసక్తిని కలిగి యుండిరి. "వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్తరించెను..... వారు తమ సామర్థ్యము కొలదియేగాక సామర్థ్యము కంటె ఎక్కువగాను తమంతట తామే యిచ్చిరని" పౌలు వారిని గూర్చి చెప్పెను (2 కొరింథీ 8:1-4). నేను ప్రభువుకు కానుకలిచ్చినప్పుడు దేవునితోను ఆయన పనిలోను సంఘము ద్వారా వ్యక్తిగత సహవాసముకలిగి యుందును.

- డేవ్ ఓవెన్స్

# దేవుడు హృదయమును ఎట్లు తెరచును ?
## (How Does the Lord open the Heart ?)

" అప్పుడు లూదియయను దైవ భక్తిగల స్త్రీ వినుచుండెను. ఆమె ఊదారంగు పొడిని అమ్ము తుయతైర పట్టణస్థురాలు. ప్రభువు ఆమె హృదయమును తెరచెను గనుక ప్రభువు చెప్పిన మాటల యందు లక్ష్యముంచెను" అని అపో.కా. 16:14లో వ్రాయబడి యున్నది. అయితే ప్రభువు ఒకని హృదయమును ఎట్లు తెరచును ? అనునది మన ప్రశ్న.

**1. ఇక్కడ హృదయము అను మాట లూదియ యొక్కగ్రహణ శక్తిని సూచించుచున్నది.**

ఒకడు వాక్యమును వినుచున్నపుడు అతడు లేక ఆమె ఆలోచించును, (మత్తయి 9:4; హెబ్రీ 4:12), గ్రహించును (మత్తయి 13:15). యోచించును (మార్కు 2:6). విశ్వసించును (యోహాను 12:40: రోమా 10:10), అని లేఖనముల తెలియజేయుచున్నవి. అందునుబట్టి పరిశుద్ధాత్మావేశము వలన లూకా లూదియ యొక్క హృదయము తెరువబడెనని వ్రాసినప్పుడు ఆమె వినిన వాక్యమును గ్రహించుకొనెనని తెలియజేయుచున్నాడు (లూకా 24:45: అపో.కా. 26:18). ఆమె సువార్తనంగీకరించుటకు సుముఖముగా యుండెను (అపో. 8:6,12; హెబ్రీ 12:1,2). ఎఫెసీ 1:18 "మీ మనో నేత్రములు వెలిగింపబడినందున" అను మాట యున్నది. అనగా మీ విజ్ఞతను బట్టి గ్రహించుకొనినందునయని దాని యర్థము.

**2.** లూదియ యొక్క గ్రహణశక్తిని ప్రభువు సత్యము వలన తెరిచారు. (రోమా 16 ; 1 కొరింథీ 15:1,2 ; యాకో 1:12). యేసే రక్షకుడని లూదియ అంగీకరిం చునట్లు సత్యము అన్ని అభ్యంతరములను నిర్మూలించెను. అదేరీతిగా ప్రభువు మన హృదయములను తెరచును (లూకా 18:15). నేడుకూడ అదే పద్ధతిని ఆయన వినియోగించుచున్నారు (2 థెస్స 2:13,14; కీర్తన 119:104, 105, 130, 19:7; యోహాను 6:63; 8:31,32).

**3. లూదియ వాక్యమును వినుటకును, విధేయత చూపుటకును నిరాకరించిన యెడల ఆమె హృదయమును మూసివేసికొనెనని చెప్పుకోవచ్చును.** ఈ వచనమును గమనించుము: "నేటివరకును మోషే గ్రంథము వారు చదువునప్పుడెల్ల ముసుకు వారి హృదయముల మీద నున్నది గాని వారి హృదయము ప్రభువువైపునకు ఎప్పుడు తిరుగునో అప్పుడు ముసుకు

తీసి వేయబడును'' (2 కొరింథీ 3: 15-16).

ప్రభువు లూదియ యొక్క హృదయమును తెరచెను అనగా, గతములో ఏదో ఒక విధముగా ఆమె హృదయము మూసికొని యుండెనను అర్థము వచ్చుచున్నది. పాపజీవితము వలన ఆమె హృదయము గట్టి బడిపోయి మూసుకొని యుండలేదు. ఏలయనగా ఆమె దేవుని ఆరాధించడములో ఆసక్తి పరురాలియై యుండెను. భక్తిగల యూదురాలి యొక్క హృదయమువలె ఆమె హృదయము కూడ క్రీస్తు విషయమై మూసుకొని యుండెను. అనేకులైన యూదులు యేసు విషయమైన సత్యమును గ్రహించక తమ హృదయములను కఠినపరచుకొని యుండిరి. ఆయన వారికి అడ్డుబండగా యుండెను (యోహా 15:44; 1 కొరింథీ 1:23). అయితే లూదియ క్రీస్తును గూర్చిన సత్యవాక్యము పౌలు ద్వారా వినగా ఆమెగ్రహించుకొని, దానిని స్వీకరించి బాప్తిస్మము పొంది క్రైస్తవురాలయ్యింది. ఇవ్విధముగా దేవుడు లూదియ యొక్క హృదయమును తెరచెను.

- మైక్ బెన్సన్

## సంఘాభివృద్ధి కొరకు సూత్రములు
## (Keys to Church Growth)

ప్రేమ : దేవుని యెడలను, తోటి మానవుల యెడలను క్రైస్తవ్యములో ప్రేమ అత్యవసరము. ధర్మశాస్త్రోపదేశకుడొకడు యేసు నొద్దకు వచ్చి "ధర్మశాస్త్రములో ముఖ్యమైన ఆజ్ఞ యేదని అడిగెను. అందుకాయన నీపూర్ణహృదయము తోను నీ పూర్ణాత్మతోను, నీపూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునదియే, ఇది ముఖ్య మైనదియు మొదటిదియునైన ఆజ్ఞ. నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెనను రెండవ ఆజ్ఞయు దాని వంటిదే. ఈ రెండు ఆజ్ఞలు ధర్మశాస్త్రమంతటికిని ప్రవక్తలకును ఆధారమై యున్నవని అతనితో చెప్పెను" (మత్తయి 23:36-40). సంఘములు ప్రేమించును గనుక వారు అభివృద్ధి జెందుదురు.

ప్రార్థన : ఈలోకమునకు లేని శక్తిని ఒకదానిని క్రైస్తవులు కలిగి యున్నారు. అది ప్రార్థనాశక్తి, "నీతిమం

తుని విజ్ఞాపన మన:పూర్వకమైనదై బహుబలము గలదై యుండును” అని యాకోబు వ్రాసాడు (యాకోబు 5:16). ప్రార్థన ద్వారా గొప్ప క్రియలు సాధించ బడును. పాడైపోయిన యెరూషలేము పట్టణ ప్రాకారములను తిరిగి కట్టుటలో విజయముసాధించుట కొరకు ప్రజలు ఎంత వట్టుదలతో ప్రార్థించిరో తెలిసికొనుటకు నెహెమ్యా గ్రంథము చదువుము. రాత్రింబవళ్లు ప్రార్థన చేసే సంఘములు అభివృద్ధి జెందును.

స్టడీ : మనలను పనిచేయుటకు నడింపించేది దేవుని వాక్యజ్ఞానమే. దేవుని హెచ్చరికలను బట్టి నిర్మించుటకు సహాయము చేయునది కూడ అదియే. కొందరు వాక్యమును పఠించరు గనుక వారు యేమీ సాధించలేరు. “ఎందు కనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటు వంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది” యను సంగతిని మరచి పోకూడదు (హెబ్రీ 4:12). బైబిలును స్టడీ చేసేవారు నిర్మించుటకు పూనుకొందురు. సంఘములు క్రమముగా, తరచు కూడుకొని బైబిలును స్టడీ చేయు దురు గనుక అవి అభివృద్ధి జెందును.

కానుకలు ఇయ్యాలి : అభివృద్ధిజెందే సంఘములు యిచ్చే సంఘములు, పుచ్చు కొనేవి కావు. వారు తమ సమయాన్ని ధనాన్ని కూడ యిస్తారు. వారు పరిచర్య చేయించుకొనుటకు కాదు గాని పరిచర్య చేయుట వారి విధియని గుర్తింతురు. అపో.కా. 20:35 ను వారెరుగుదురు. దానిని విశ్వసిం తురు: “పుచ్చుకొనుట కంటె యిచ్చుట ధన్యము” అని యేసు చెప్పెను. అభివృద్ధిజెందుచున్న ఒక సంఘమును నాకు చూపించుము. ధారాళముగా యిచ్చే సంఘాన్ని నీకు చూపింతును. అభివృద్ధిజెందే సంఘాలు యిస్తారు, యిచ్చుచు యుంటారు. సహోదరులారా, మనము అభివృద్ధిజెందుదాం !!

– కెన్ టేలర్

# సంక్షిప్త వార్తలు

2015 నూతన సంవత్సరము శుభారంభమాయెను. జనవరి 4వ తేదీ ఆదివారమున సికింద్రాబాద్‌లో యాప్రాల్‌లో మొట్టమొదటిసారిగ క్రీస్తు సంఘ ఆరాధనలో ప్రారంభమాయెను. 2014 సెప్టెంబరులో యాప్రాల్‌లో జాషువా గూటంగారు, మార్క్ రేనాల్డ్‌గారు రెండు దినములు బైబిలు తరగతులు నిర్వహించుట చదువరులకు విధితమే. ఆ క్లాసుల యొక్క ఫలితముగా ఆ ప్రాంతములో నివసించుచున్న కొందరు క్రీస్తు సంఘసభ్యులు సంఘముగా కూడుకొని ఆరాధన కార్యక్రమములు నిర్వహించుటకు పూనుకొనిరి. వీరిలో సోదరులు లెమూయేల్ ఆచారియ గారు ప్రముఖులు. యాప్రాల్‌లో క్రీస్తు సంఘము లెమూయేల్ గారి యింటి బేస్‌మెంట్‌లో కూడుకొనుటకు ఆరంభించగా మొదట ఆదివారమున 50 మందికి పైగా ఆరాధనలో పాల్గొనిరి. జాషువాగూటం గారు ఆ రోజు వాక్యపరిచర్య చేయగా సోదరులు ఆశీర్వాదముగారు ప్రభు రాత్రి భోజనమును నడిపించిరి. 2015 మొదటి ఆదివారమున, తదుపరి మొదటి నెల కూడ యాప్రాల్‌లోని క్రీస్తు సంఘము నమ్మకముగా ప్రభువు పరిచర్యలో కొనసాగినది.

2015 జనవరి 4వ తేదీ ఆదివారము సత్యవాణి క్రీస్తు సంఘరాధనలో అమెరికా నుండి వచ్చిన సోదరులు మార్క్ రేనాల్డ్ గారి కుటుంబము పాల్గొనిరి. నాడు జరిగిన ఆరాధనలో మార్క్‌గారు వాక్యోపదేశము చేసిరి. ఆయన సతీమణి మెండీ రేనాల్డ్ మరియు ఇద్దరు కుమార్తెలు కూడ ప్రభువు పనిలో సంతోషముతో ఒక వారము దినములు పాల్గొనిరి.

2015 జనవరి 7వ తేదీ బుధవారము జాషువా గూటం దంపతుల కనిష్ఠ కుమారుడు రాబిన్ గూటం గారికి వలసపాకల వాస్తవ్యులు నూకపెయినా దేవదాసు గారి కుమార్తె రేచెల్ విమలతో వివాహ నిశ్చితార్ధ కార్యక్రమము వాకలపూడిలో ఘనముగా జరిగినది. ఆ సందర్భముగా మార్క్ రేనాల్డ్ గారు మంచి వాక్య పరిచర్య చేసిరి.

2015 జనవరి 9వ తేదీ శుక్రవారము కొప్పిగుంటలో జరిగిన సువార్త కూటములో మార్క్ రేనాల్డ్‌గారు, రోనీ గూటం గారు పాల్గొనిరి. మార్క్ గారు వాక్యపరిచర్య చేయగా ఒక వ్యక్తి బాప్తిస్మము పొందెను. కొప్పిగుంటలో సోదరి బొక్కా పుష్పవతి గారి బలమైన విశ్వాసము వలన అక్కడి సంఘము దినదినము వృద్ధి జెందుచున్నది. కొప్పిగుంటలో బూల యోహాను, చిరంజీవి గార్లు పరిచర్య చేయుచున్నారు.

2015 జనవరి 28వ తేదీ బుధవారం రాబిన్ గూటం గారి వివాహము రేచెల్ విమల (యం.ఫార్మసీ) గారితో జరిగెను. ఆయన వివాహము కాకినాడ యస్.ఆర్.యం.టి. ఫంక్షన్ హాలులో అత్యంత వైభవోపేతముగా జరిగెను. ఆ వివాహమును తిలకించుటకు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రములలో 14 జిల్లాలనుండియు, ఇండియాలో 5 రాష్ట్రములనుండియు, అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్‌ల నుండియు బంధువులు, మిత్రులు, సోదరసోదరీలు హాజరుకాగా వివాహ ప్రాంగణమంతయు జనముతో కిటకిటలాడెను. అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణములో వేల కొలది ప్రజలు వీక్షించుచుండగా డా॥ సుధీర్‌కుమార్ మొహంతిగారు రాబిన్ - రేచెల్‌ల యొక్క వివాహ కార్యక్రమమును జరిపించిరి. డా॥ అరుణ్‌కుమార్ మొహంతిగారును, నెహెమ్యా గూటం గారును వివాహ సందేశములనిచ్చిరి. తెలంగాణా ప్రభుత్వ ప్రతినిధి జాన్‌వెస్లీగారును, రక్షణ టి.వి. సి.ఇ.ఓ. బెన్‌హర్ గారును శుభాకాంక్షలు తెలిపిరి. రాబిన్, రేచెల్ గూటం గార్ల వైవాహిక జీవిత శ్రేయస్సు కొరకు వచ్చి, వారిని ఆశీర్వదించిన వారందరికీ జాషువా గూటం దంపతులు ఈ పత్రిక ద్వారా శుభాభివందనములు తెలుపుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004